సాక్షి
పల్నాడు
బుధవారం । 30 । ఆగస్టు । 2023



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో....

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఎంపీ మోపిదేవి వెంకట రమణా రావు, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి నరసింహారావు దర్శించుకున్నారు.



ముగిసిన పవిత్రోత్సవాలు

గంపలగూడెం: నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు మంగళవారం పూర్ణాహుతితో ముగిశాయి.

బండ్లమ్మ అమ్మకు పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం) : బాపట్ల జిల్లా చందోలులోని బగళాముఖి బండ్లమ్మ అమ్మవారి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని శ్రావణ మంగళ మహాగౌరిగా, అభయ ప్రదాయినిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

నేడు అరుణాచలంకు ఆర్టీసీ బస్సు సిద్ధం

సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ డిపో నుంచి బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు అరుణాచలంకు అల్ట్రా డీలక్స్ బస్సు బయలుదేరుతుందని డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ తెలిపారు. 31న అరుణాచలం ప్రదక్షిణ, దర్శనం అనంతరం అదే రోజు సాయంత్రం బయలుదేరి కంచి మీదుగా సెప్టెంబర్ ఒకటిన సత్తెనపల్లి వస్తుందని వివరించారు. టికెట్ ధర రాను, పోను ఒక్కొక్కరికి రూ.1,900 మాత్రమేనని పేర్కొన్నారు. టికెట్లు కావాల్సిన వారు 99592 25429, 63049 59773 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ విజయవంతం



నరసరావుపేట: స్థానిక డీఎస్‌ఏ స్టేడియంలో ఈ నెల 20వ తేదీ నుంచి అగ్నిపథ్ పథకంలో భాగంగా నిర్వహించిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ విజయవంతమైందని కల్నల్ పునీత్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎల్.శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు, ర్యాలీలో విధులు నిర్వహించిన అధికారులను కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు అభినందనలు తెలిపారు. జిల్లా యంత్రాంగం కృషి అభినందనీయమన్నారు. సహాయ సహకారాలు అందజేసిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్లకు మెమెంటో అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.


గుంటూరు జిల్లాలో 5,614 కొత్త పెన్షన్లు

- బాపట్ల జిల్లాలో 5,152 పెన్షన్లు మంజూరు
- సెప్టెంబర్ 1న అందజేత



నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారుల సంఖ్య గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భారీగా పెరిగింది. ప్రతి ఆరు నెలలకొకసారి ప్రభుత్వం కొత్త సామాజిక పింఛన్లు మంజూరు చేస్తుంది. తాజాగా గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భారీగా కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. గుంటూరు జిల్లాలో 5,614, బాపట్ల జిల్లాలో 5152 పింఛన్లు మంజూరయ్యాయి. కొత్త పింఛన్లను సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అందించనున్నారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 3711 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 140, బ్యాంక్ కెనాల్‌కు 988, తూర్పు కెనాల్‌కు 330, పశ్చిమ కెనాల్‌కు 150, నిజాంపట్నం కాలువకు 285, కొమ్మమూరు కాల్వకు 1520 క్యూసెక్కులు విడుదల చేశారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 522.20 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 854.20 అడుగుల వద్ద ఉంది.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2800, గరిష్ట ధర రూ.4600, మోడల్ ధర రూ.3500 వరకు పలికింది.

విద్యయోత్సవం



'గౌరవ'ం : అడిషనల్ డీజీపీ (లా అండ్ ఆర్డర్) రవిశంకర్ అయ్యన్నార్‌కు గౌరవ డాక్టరేట్ అందజేస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్



'పట్టా'భిషేకం : న్యాయవిద్యలో బంగారు పతక విజేత ఎం.రోజాకు పట్టా అందిస్తున్న గవర్నర్



'మెడలో' స్వర్ణశోభితం : మూడు గోల్డ్ మెడల్స్ పొందిన బి.బాలభవానీకి పతకం వేస్తున్న గవర్నర్

ఎగసిన సంతోషాల సిరులు.. ఆనందబాష్పాలు రాల్చిన ఉద్విగ్న క్షణాలు.. సన్నిహితులు, కుటుంబ సభ్యుల అభినందన మందార మాలలు.. ఆచార్యులు అందించిన ఆశీస్సుల మంగళ వచనాలు.. సహచర విద్యార్థుల కేరింతల కరతాళ ధ్వనులు.. జీవితంలో చిరస్థాయిగా మిగిలే మధుర జ్ఞాపకాల ఉషస్సులు.. వీటన్నింటి సమాహారమై మంగళవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మురిసింది. 'విద్య'యోత్సవ వేదికై మెరిసింది. స్నాతకోత్సవం వేళ.. సంబరమై నవ్వులు చిందించింది.

- వైభవంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం
- సంపాదకుడు పాలగుమ్మి సాయినాథ్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం
- పట్టాలు, పతకాలు, బహుమతుల గ్రహీతల ఆనందోత్సాహాలు
- యూనివర్సిటీలో పండగ వాతావరణం





'ఆన'ందం : పట్టాల గ్రహీతలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 39, 40వ స్నాతకోత్సవం మంగళవారం అట్టహాసంగా జరిగింది. విద్యార్థులు ఆనందంగా వేడుకలో పాల్గొన్నారు. ప్రత్యేక గౌన్‌లు, రోబ్‌లు ధరించి గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టరేట్‌లు, డిగ్రీలు, బంగారు పతకాలు అందుకున్నారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం

యూనివర్సిటీ చాన్సలర్, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్‌కు ఏఎన్‌యూలోని డైక్‌మెన్ ఆడిటోరియం వద్ద వీసీ ఆచార్య పి.రాజశేఖర్, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఖాన్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ బి.కరుణ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. గార్డ్ ఆఫ్ హానర్ స్వీకరించిన అనంతరం ప్రత్యేక గదిలో స్నాతకోత్సవ దుస్తులు ధరించిన గవర్నర్, యూనివర్సిటీ ఉన్నతాధికారులు స్నాతకోత్సవ ప్రక్రియకు ఆమోదం తెలిపారు. గవర్నర్ అబ్దుల్ నజీర్, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్, డీన్‌లు, స్నాతకోత్సవ వేదికపైకి చేరుకున్నారు. వీసీ యూనివర్సిటీ సమగ్ర అభివృద్ధి నివేదిక సమర్పించారు. సంపాదకుడు పాలగుమ్మి సాయినాథ్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. యూనివర్సిటీ చాన్సలర్, గవర్నర్ జస్టిస్ నజీర్ పట్టాలు, బంగారు పతకాలు, డాక్టరేట్ గ్రహీతలతో వాగ్దానం చేయించారు. 30 మంది పీహెచ్‌డీ, డిగ్రీలు, బంగారు పతకాలను గవర్నర్ చేతులమీదుగా అందుకున్నారు. స్నాతకోత్సవంలో మొత్తంగా 260 పీహెచ్‌డీ పట్టాలు, 235 బంగారు పతకాలు, 18 నగదు బహుమతులు ప్రదానం చేశారు.

సెల్ఫీలు, ఫొటోల కోలాహలం

స్నాతకోత్సవం జరిగిన డైక్‌మెన్ ఆడిటోరియం పట్టాలు, పతకాల గ్రహీతలు, వారి కుటుంబ సభ్యులు, సన్నిహితుల ఆలింగనాలు, అభినందనలు సెల్ఫీలు, ఫొటోలతో కోలాహలంగా మారింది. డిగ్రీలు, పట్టాలు తీసుకున్న వారు తమ గురువులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఏఎన్‌యూకు అంతర్జాతీయ ఖ్యాతి

వీసీ పి.రాజశేఖర్ ఏడాది కాలంలో యూనివర్సిటీ సాధించిన సమగ్రాభివృద్ధిని వివరించారు. విద్య, పరిశోధన, బోధన, మౌలిక వసతుల కల్పనలో ఏఎన్‌యూ అంతర్జాతీయ స్థాయిలో వృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ఏడాదిలో అనేక జాతీయ, అంతర్జాతీయ ర్యాంకులు సొంతం చేసుకుందని చెప్పారు. విదేశీ అధ్యాపకులు ఏఎన్‌యూలోనే ఉండి ఒక సెమిస్టర్ బోధించే విధానం అమల్లోకి తెస్తున్నామని వెల్లడించారు. ఏడాదిగా ఏఎన్‌యూ 448 రీసెర్చ్ పబ్లికేషన్స్, 15 పేటెంట్‌లు సాధించిందని వీసీ సగర్వంగా ప్రకటించారు.

గవర్నర్ చేతుల మీదుగా 30 మందికి..

స్నాతకోత్సవంలో మొత్తం 30 మందికి పీహెచ్‌డీ పట్టాలు, బంగారు పతకాలు, నగదు బహుమతులను గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా ప్రదానం చేశారు. వీరిలో గౌరవ డాక్టరేట్ అందుకున్న అడిషనల్ డీజీపీ ఎ.రవిశంకర్ అయ్యనార్, ఎ.చంద్రభాను రెడ్డి, ఇ.షీల (కామర్స్), కె.పృథ్వీరాజు(హెచ్‌ఆర్ ఎం), జి.శ్రీరామకృష్ణారావు , ఎస్‌టీవీ ఆనంద లక్ష్మి, ఎం.మేరి (ఎడ్యుకేషన్), వి.బాలాజి, డి.ఉమా శంకర్ చింతల, కె.శంకర రాజశేఖర్ (ఇంజినీరింగ్), ఆర్.వెంకటేశ్వర్లు(సంస్కృతం), జి.సంపత్ కుమార్, పి.సుధా కిరణ్ కుమార్ (ఇంగ్లిష్), పి.చిరంజీవి, కె.పార్వతిబాయి, ఎం.రోజా (న్యాయశాస్త్రం), ఎస్.లక్ష్మీసాయి సుధా శ్రీవాణి(బయోటెక్నాలజీ), ఎస్.మంజుల శ్రీవేణి(జువాలజీ), ఎస్.రత్నమంజరి (బోటనీ), కె.శ్రీహర్ష, ఎ. మేరీ మనోరంజని, పి.భాగ్య రేఖ(ఫార్మసీ), ఎం.సత్తార్ ఖాన్, డి.సురేష్, వి.నాగ దుర్గ (ఫిజికల్ ఎడ్యుకేషన్), పి.వేణుగోపాలరావు(మాథమాటిక్స్), ఎ.వెంకట శేఖర్(ఫిజిక్స్), బాలభవాని(కెమిస్ట్రీ), పి.రాజకుమార్, బి.ఆశి రత్నం (అంబేడ్కర్ చైర్), ఎస్ రఘు(సోషల్ వర్క్), సీహెచ్ జ్యోతి (ఉమెన్ స్టడీస్), ఉన్నారు. మిగిలిన వారికి వీసీ రాజశేఖర్ పట్టాలు, పతకాలు, బహుమతులు అందజేశారు.

విద్య, వైద్యానికి పెద్దపీట



గణపవరంలో లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

నాదెండ్ల: రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికీ నాణ్యమైన ఉన్నత విద్య, కార్పొరేట్ స్థాయి మెరుగైన వైద్యం అందించాలన్నదే తమ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గణపవరం గ్రామంలో మంగళవారం 28 మంది లబ్ధిదారులకు రూ.18.77 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆమె అందించారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యం పొందుతున్న తూబాడు గ్రామానికి చెందిన ఏరువ చిన్నపరెడ్డికి రూ.1.5 లక్షలు, సంకురాత్రిపాడు గ్రామానికి చెందిన గాలి శ్రీధర్‌కు రూ.1.20 లక్షలు, చందవరం గ్రామానికి చెందిన చేరెడ్డి లక్ష్మికి రూ.1.30 లక్షలు, గణపవరం గ్రామానికి చెందిన గొట్టిపాటి నాగేశ్వరరావుకు రూ.80 వేలు, ఇదే గ్రామానికి చెందిన ఆవుల శ్రీనివాసరావుకు రూ.75 వేలు, మరో 23 మందికి కలిపి మొత్తం రూ.18.77 లక్షలు అందించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మనబడి నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి విద్యార్థులకు ప్రపంచస్థాయి నాణ్యమైన విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. సరిపడా తరగతులు, కుర్చీలు, బల్లలు, విద్యా సామగ్రి సమకూర్చి, ఉపాధ్యాయుల కొరత లేకుండా నియామకాలు జరిపామన్నారు. ట్యాబ్‌ల ద్వారా అధునాతన పాఠ్యాంశాలను అందుబాటులో ఉంచామన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, జగనన్న విద్యాకానుక కిట్లు, పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనం వంటి పథకాలతో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని వివరించారు.

వైద్య వసతులు అద్భుతం

వైద్య రంగంలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎన్నో అద్భుత కార్యక్రమాలు చేపట్టామని మంత్రి రజిని పేర్కొన్నారు. పీహెచ్‌సీల నిర్మాణం చేపట్టడంతోపాటు అధునాతన చికిత్సా విధానాలను అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రతి వ్యక్తి ఆరోగ్య వివరాలు నమోదు చేసుకుని తద్వారా అవసరమైన సందర్భాల్లో సరైన చికిత్స అందించే అవకాశం కలిగిందన్నారు. 104, 108 వాహనాలు అమూల్యమైన సేవలు అందిస్తున్నాయన్నారు. చిలకలూరిపేట పట్టణంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేసి వివిధ విభాగాల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ, వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాట్రు రమేష్, కౌన్సిలర్లు పిల్లి సాగర్‌బాబు, షేక్ ఆదం వలి, తులం సుధాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు తలహాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ పథకాన్ని వినియోగించుకోవాలి

కలెక్టర్ లోతేటి శివశంకర్

నరసరావుపేట: సంప్రదాయ హస్త కళా నైపుణ్యాల పెంపునకు, చేతివృత్తిదారులను ఆదుకునేందుకు ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని, ఈ పథకాన్ని జిల్లాలోని చేతివృత్తుల వారు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. పథకం ద్వారా తొలి ఏడాది 18 సంప్రదాయ చేతివృత్తుల వారికి ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ పథకంలో శిక్షణ పొందేందుకు దరఖాస్తున్న చేసుకున్న వారికి రోజుకు రూ.500 ఉపకార వేతనం చెల్లిస్తారని వివరించారు. శిక్షణ తర్వాత పరికరాల కొనుగోలుకు రూ.15 వేలు ఆర్థికసహాయం అందిస్తారన్నారు. హస్త కళాకారులు ఈ పథకం ద్వారా సబ్సిడీ వడ్డీతో మొదటి దఫా రూ.లక్ష రుణం తీసుకోవచ్చునని, రెండో దఫా రూ.2 లక్షలు వరకు రుణం పొందవచ్చని వివరించారు. వడ్డీ రేటు 5 శాతంగా ఉంటుందని వివరించారు. దుర్గిలో శిల్ప కళాకారులతోపాటు, లెదర్ పప్పెట్ ఆర్టిసన్ ద్వారా అర్హులైన అభ్యర్థులను గుర్తించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ పథకంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

గురువర్యా చర్చిద్దాం రండి!

- నేడు, రేపు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు
- విద్యా కార్యక్రమాల అమలుపై విస్తృత సమీక్ష
- టీచింగ్, లెర్నింగ్ కేంద్రాలుగా సీఆర్‌సీలు బలోపేతం
- తొలిసారిగా ఫిజికల్ ఎడ్యుకేషన్ కాంప్లెక్స్ సమావేశాలు
- పల్నాడు జిల్లాలో 194 స్కూల్ కాంప్లెక్స్‌లు



స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో సూచనలు చేస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు(ఫైల్)

సత్తెనపల్లి: స్కూల్ కాంప్లెక్స్‌ను బలోపేతం చేసేలా విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు. పాఠశాల స్థాయిలోనే పటిష్టమైన పునాదులు వేసేలా బోధనలో వినూత్న పద్ధతులు అవలంబిస్తున్నందున ఉపాధ్యాయుల భాగస్వామ్యం పెంచటం ద్వారానే మెరుగైన ఫలితాలు సాధించవచ్చనే ఉద్దేశంతో కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతినెలా క్రమం తప్పకుండా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించేలా జిల్లా విద్యాశాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈనెల 30,31 తేదీల్లో జిల్లాలోని అన్ని స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. తొలిసారిగా ఫిజికల్ ఎడ్యుకేషన్ కాంప్లెక్స్ సమావేశాలూ నిర్వహిస్తుండటం ద్వారా పాఠశాలల్లో క్రీడా విద్యకు పెద్దపీట వేసే అవకాశాలు ఉన్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

కాంప్లెక్స్ నిర్వహణకు ప్రత్యేక నిధులు

జిల్లాలో ప్రైమరీ స్కూల్ కాంప్లెక్స్‌లు 128, తెలుగు, హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్, సోషల్ సబ్జెక్ట్ కాంప్లెక్స్‌లు 56, ఉర్దూ కాంప్లెక్స్‌లు మూడు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు ఏడు ఉన్నాయి. ఎంపిక చేసిన పాఠశాల కేంద్రంగా జరిగే కాంప్లెక్స్ సమావేశానికి ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని సమీప పాఠశాలల నుంచి 40 నుంచి 50 మంది వరకు ఉపాధ్యాయులు హాజరవుతారు. వీరికి శిక్షణ, బోధనోపకరణాల తయారీపై అవగాహన సదస్సులు కాంప్లెక్స్ కేంద్రాలుగానే జరుగుతాయి. కాంప్లెక్స్ చైర్మన్‌గా ఉన్న హెచ్‌ఎం పాఠశాలలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. వీటి నిర్వహణకు ఏడాదికి రూ. 25 వేలు ప్రభుత్వం ప్రత్యేకంగా మంజూరు చేస్తుంది. క్లాంప్లెక్స్ స్థాయిలో ప్రతినెలా నిర్వహించే సమావేశాలకు ఈ నిధులను వినియోగించుకునేలా అవకాశం కల్పించారు.

సమీక్ష ఇలా..

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు జరుగుతుంది. వందేమాతరం గీతాన్ని ఉపాధ్యాయులంతా ఆలపించాలి. అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి ఉపన్యాసం ఉంటుంది. 9.30 గంటలకు ఎఫ్ఏ -1 పరీక్ష నిర్వహణపై సమీక్ష ఉంటుంది. బోధన పద్ధతుల్లో అవలంబించే వివిధ పద్ధతులు, వాటికి వినియోగించే బోధనోపకరణాలపై చర్చిస్తారు. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం గత నెలలో నిర్వహించిన కార్యక్రమాలు, రాబోయే నెలలో వాటిని మరింత విజయవంతంగా నిర్వహించటంలో అవలంబించాల్సిన అంశాలపై చర్చిస్తారు.

విద్యా కార్యక్రమాలపైనే చర్చ

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో కేవలం విద్యా సంబంధిత కార్యక్రమాలపైనే చర్చించాలి. ఉపాధ్యాయ సంఘాల సమావేశం, సర్వీసు పరమైన అంశాలు, బదిలీలు, పదోన్నతులు, సన్మానాలు వంటి వాటిని ప్రస్తావించకూడదు. ఎటువంటి వ్యక్తిగతమైన అంశాలు చర్చించడానికి వీల్లేదని విద్యాశాఖాధికారులు స్పష్టం చేస్తున్నారు.

మహనీయుడు గిడుగు రామ్మూర్తి





గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు పక్క చిత్రంలో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

- కలెక్టర్ శివశంకర్
- అట్టహాసంగా తెలుగుభాషా దినోత్సవం

నరసరావుపేట ఈస్ట్: వ్యవహారిక భాషాభివృద్ధికి అవిరళ కృషి చేసిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి అని కలెక్టర్ లోతేటి శివశంకర్ కొనియాడారు. వ్యవహారిక భాషోద్యమకారుడు గిడుగు జయంతిని పురస్కరించుకొని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రకాష్‌నగర్‌లోని భువనచంద్ర టౌన్ హాల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ 1905 సంవత్సరంలోనే తెలుగు వ్యవహారిక భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి బీజం వేశారని తెలిపారు. తెలుగు భాషా వైభవాన్ని నేటి తరానికి పరిచయం చేసేందుకు ప్రతినెలా మూడో శనివారం టౌన్‌హాల్‌లో నెలనెలా వెన్నెల పేరుతో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేసి తెలుగు కవులపై అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు. శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం మాట్లాడుతూ భాషకు మరణం ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 13న కవయిత్రి మొల్ల జయంతిని రాష్ట్ర పండగగా ప్రకటించిందని గుర్తుచేశారు. శాసన మండలి సభ్యుడు కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ తెలుగు భాషా ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రభుత్వ పోటీ పరీక్షల్లో తెలుగుకు వెయిటేజీ మార్కులు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా తెలుగు భాషకు సంబంధించిన ఛాయా చిత్ర ప్రదర్శనలు కలెక్టర్ శివశంకర్ ప్రారంభించి ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి తిలకించారు. విద్యార్థులకు, అధికారులకు తెలుగు క్విజ్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులను సత్కరించారు. అలాగే జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్, సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఓబుల నాయుడు, ఉద్యానవనశాఖాధికారి బెన్నీ, జిల్లా పరిశ్రమలశాఖాధికారి వెంకటేశ్వరరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయి, సెరీ కల్చర్ అధికారి సుధారాణి, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ సునీల తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించండి

వ్యవసాయశాఖకు సూచించిన జిల్లా కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నరసరావుపేట: వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలో పత్తిపంట సాగు తగ్గినందున రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ వ్యవసాయాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సాయి మార్కొండారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి జిల్లా కలెక్టర్ హాజరై మాట్లాడారు. సుమారు 70వేల ఎకరాల్లో పత్తిపంట తగ్గనుందన్నారు. ఈ మేరకు ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించి విత్తనాలు అందజేసి సాగుజరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. నల్లరేగడి భూముల్లో మినుము, పెసర, కంది పంటలను వచ్చే సెప్టెంబరు 15 నుంచి సాగుచేయాలని, లేనిపక్షంలో అక్టోబరు నుంచి మంచి శనగ సాగుచేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కొద్దిపాటి సాగునీరు సౌలభ్యం ఉన్నచోట మొక్కజొన్న, రాగి, జొన్న, సజ్జ లాంటి పంటలను సాగుచేసి రైతులు తమ భూమిని ఖాళీగా ఉంచకుండా ఆదాయాన్ని పొందేవిధంగా ఆర్‌బీకేల ద్వారా రైతులకు తెలియచేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, అభ్యుదయ రైతులు, సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

నిమ్మగడ్డ వారిపాలెంలో కేంద్ర బృందం పర్యటన



నిమ్మగడ్డవారిపాలెంలో మంచినీటి చెరువును పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ప్రత్తిపాడు: మండల పరిధిలోని నిమ్మగడ్డ వారిపాలెంలో మంగళవారం కేంద్ర బృందం పర్యటించింది. ఫౌండేషన్ ట్రైనింగ్ లో భాగంగా ఆరుగురు బృందంతో కూడిన సెంట్రల్ సెక్రటేరియట్ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు భారత్ దర్శన్ నిమిత్తం గ్రామాలను సందర్శిస్తున్నారు. అందులో భాగంగా ప్రత్తిపాడు మండలం నిమ్మగడ్డ వారి పాలెం గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అమృత సరోవర్ పథకం కింద అభివృద్ధి చేసిన రక్షిత మంచినీటి చెరువును పరిశీలించారు. చెరువు చుట్టూ గట్లపై నాటిన ప్లాంటేషన్‌ను పరిశీలించారు. పథకం వివరాలను స్థానిక ఏపీవో షేక్ మస్తాన్ వలి వివరించారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలు అమలు చేస్తున్న పలు పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. వెంట ఏపీఎస్ఐఆర్డీ నోడల్ ఆఫీసర్ ఏ శేఖర్ బాబు, ఈవోపీఆర్డీలు శ్రీనివాస రావు, మోషే, సర్పంచ్ జి. పద్మావతి సతీష్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం కృషి

- అవసరమైన ప్రాంతాల్లో అదాలత్‌లు
- ప్రకాశం ఎస్ఈ కే సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎస్ఈ సత్యనారాయణ

మార్టూరు: రైతులు, విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం అధికారులందరూ కృషి చేయాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా విద్యుత్‌శాఖ సూపరిండెంటెంట్ ఇంజినీర్ కే సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక ఇంటూరి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మార్టూరు సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన మండలాల వారీగా సమస్యలు, పరిష్కారాలు, బిల్లుల వసూళ్ల గురించి సమీక్షించారు. డిజిటల్ మీటర్లు సిద్ధంగా ఉన్నా యని అవసరమైన వారు తెప్పించుకొని వినియోగదారులకు ఏర్పాటు చేయాలన్నారు. బిల్లుల వసూళ్లలో యద్దనపూడి మండల అధికారులు మెరుగ్గా ఉన్నారని చెప్పారు. మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు మండలాల వారు పనితీరు మెరుగుపరచుకోవాలని, లేకుంటే చర్యలకు వెనుకాడబోమన్నారు. సిబ్బంది కొరతగా ఉన్నచోట పని తక్కువగా ఉన్న మండలాల నుంచి సర్దుబాటు చేసుకొని సమస్యలు, బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. త్వరలో ఏఈలు, లైన్‌మెన్‌లు ఖాళీలను భర్తీ చేసి పని ఒత్తిడి తగ్గిస్తాయని తెలిపారు. మార్టూరు ఏఈగా పనిచేసిన శ్రీనివాసరావు అవకతవకలపై చర్యలు తీసుకుంటామని విలేకరులతో ఆయన తెలిపారు. కార్యక్రమంలో అద్దంకి డీఈ నల్లూరి మస్తాన్ రావు, మార్టూరు ఏడీఈ మువ్వా సురేంద్రబాబు, ఏఈలు కిరణ్, దేవక్, సురేష్, శ్రీనివాసరావు, జేఈ హనుమంతరావు, లైన్‌మెన్లు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం చూసి సీఎంకు మద్దతు ఇవ్వండి

- ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు
- నిండుజర్లలో బీసీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన
- అనంతవరం గ్రామంలో సచివాలయ భవనం ప్రారంభం



దొడ్లేరులో ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: అభివృద్ధి, సంక్షేమం చూసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మంగళవారం అచ్చంపేట మండలం నిండుజర్ల గ్రామంలో రూ.15 లక్షల ఎంపీ నిధులతో నిర్మించే బీసీ కమ్యూనిటీ హాలు పనులకు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే నంబూరు శంకరరావులు శంకుస్థాపన చేశారు. ఎంపీ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు నిండుజర్ల గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేదన్నారు. బీసీలు ఎక్కువగా ఉన్న ఈ గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేశామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగు నీరు, పాఠశాలల అభివృద్ధి, సీసీ రోడ్లు నిర్మించామన్నారు. ఇప్పుడు బీసీ కమ్యూనిటీ హాలు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. మంచి చేసిన ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. తాను, ఎమ్మెల్యే కలిసి నిండుజర్ల గ్రామ అభివృద్ధికి ఇప్పటి వరకు రూ.11.50 కోట్లు ఖర్చుచేయటం జరిగిందన్నారు. అనంతరం రూ.18 లక్షల నిధులతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు.

అన్నివర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

అన్ని వర్గాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని దొడ్లేరు గ్రామంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. దొడ్లేరులో రూ.10 లక్షల నిధులతో ఎస్సీ కమ్యూనిటీ హాలు, రూ.2.50 కోట్లతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణానికి శంకుస్థాపనలు చేశా రు. మండలంలోని అనంతవరం గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు

బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీధర్

పర్చూరు (చినగంజాం): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామని బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ అన్నారు. మంగళవారం పర్చూరు తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఆయ న మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఎన్నికల కమిషన్ ని బంధనల ప్రకారం పని చేయాలని సూచించారు. యదార్థంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రసక్తే లేదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. నియోజకవర్గంలో నకిలీ ఓట్లు ఉన్నాయని ఇ టీవల కొందరు నాయకులు ఎన్నికల కమిషన్ దృష్టి కి తీసుకెళ్లారు. విచారణ నిమిత్తం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి జేసీని నియమించిన మీదట ఆయన పర్చూరు వచ్చి అధికారులతో చర్చించారు. కార్య క్రమంలో ఈఆర్వో వెంకట నారాయణ, తహసీల్దా ర్ సంధ్యశ్రీ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్లు ప్రోత్సహిస్తే మరిన్ని క్రీడా విజయాలు

డీఎస్ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు



క్రీడా అవార్డులు పొందిన వారితో చీఫ్‌కోచ్ వెంకటేశ్వరరవు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ప్రభుత్వంతోపాటు కార్పొరేట్ సంస్థలు, ఆర్థికంగా పరిపుష్టి కలవారు ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు సాధించే అవకాశముంటుందని డీఎస్ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక చంద్రమౌళీ నగర్‌లోని నాథ్ వెల్‌నెస్ వరల్డ్ సెంటర్‌లో గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, సహస్ర ఆర్థో అండ్ న్యూరో సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో అవార్డులను ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రీడాకారులకు నిత్యం ప్రోత్సాహముండాలని చెప్పారు. సహస్ర ఆర్థో అండ్ న్యూరో సెంటర్ చీఫ్ డాక్టర్ మామిళ్లపల్లి శివరామకృష్ణ మాట్లాడుతూ క్రీడా సాధనతో పాటు పోటీల సమయంలో ఏర్పడే గాయాలపట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. వీటికి ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. తనకు చేతనైన విధంగా క్రీడాకారులకు సహాయ సహకారాలందిస్తున్నానని చెప్పారు. అనంతరం క్రీడాకారులను, కోచ్‌లను, క్రీడా జర్నలిస్టులను సత్కరించారు. కార్యక్రమంలో గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, హాకీ కోచ్ మురళీధర్, డి.శివరామకృష్ణ, ఇ.సుహాసిని, కోచ్ వెంకటేశ్వరరావు, నూతలపాటి గోపీనాథ్ పాల్గొన్నారు.

వలపు వల..

తెనాలిరూరల్: ప్రేమ పేరుతో వ్యక్తికి వల వేసి ఇంటికి పిలిపించిన మహిళ ఆమె పరిచయస్తులతోపాటు, మరో ఇరువురితో కలిసి డబ్బులు దోచుకుంది. వివరాలు ఇలా.. కొల్లిపర మండలం సిరిపురానికి చెందిన వివాహిత భర్తతో విభేదాల కారణంగా తెనాలి నాజర్ పేటలో పిల్లలతో కలిసి ఉంటోంది. ఈమెకు కొల్లిపర మండలానికి చెందిన ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. అతనితో తరచూ ఫోన్‌లో మాట్లాడేది. సోమవారం సాయంత్రం అతనిని తెనాలిలోని తన ఇంటికి రావాలని పిలిపించింది. అతను రాగానే తెనాలిలో ఈమె సహజీవనం చేస్తున్న వ్యక్తి మరో పరిచయస్తుడిని ముందుగా పిలిచి ఇంట్లో ఉంచింది. వారితో కొల్లిపర నుంచి వచ్చిన వ్యక్తి, ఈమె కలిసి ఉన్న ఫొటోలు తీయించింది. అనంతరం తనకు డబ్బులు ఇవ్వాలని, లేదంటే ఫొటోలు బంధువులకు చూపిస్తామని బెదిరించడంతో రూ.1.40 లక్షలు వారికి ఇచ్చాడు.

త్వరలో జగనన్న కాలనీలు ప్రారంభం

ఏపీఎస్‌హెచ్‌సీఎల్ జేఎండీ శివప్రసాద్



లబ్ధిదారులతో మాట్లాడుతున్న జేఎండీ శివప్రసాద్

వేటపాలెం: త్వరలో జగనన్న కాలనీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభిస్తామని ఏపీఎస్‌హెచ్‌సీఎల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని బచ్చులవారిపాలెం వెళ్లే రోడ్డు దగ్గరలో నూతనంగా నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ కొణిజేటినగర్–2 కాలనీని జేసీ, జేఎండీ, హౌసింగ్ అధికారులతో కలసి మంగళవారం పరిశీలించారు. ముందుగా లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం, కాలనీలో సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. జేఎండీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. వీటిలో 11 లక్షలు ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. 5 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. జిల్లాలో 31,239 ఇళ్లు లబ్ధిదారులకు మంజూరు చేశామని, వీటిలో 11,400 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణం పూర్తైన కాలనీలను సీఎం జగన్ సెప్టెంబర్ 10న ప్రారంభిస్తున్నారని చెప్పారు.

వేటపాలెం మండలం పరిధిలో..

మండలం పరిధిలో నూతనంగా నిర్మించిన జగనన్న కాలనీ అదే రోజున ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కాలనీలో 303 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలు పంపిణీ చేశామని, 283 మంది లబ్ధిదారులకు పక్కా గృహాలు మంజూరు చేశారని చెప్పారు. ప్రస్తుతం 243 గృహాలు నిర్మాణాలు ప్రారంభించగా 203 గృహాలు తుదిదశకు చేరుకున్నాయని, మరో పదిరోజుల్లో పూర్తికానున్నాయన్నారు. కాలనీకి ముందు భాగంగా రూ.6.75 లక్షలతో ఆర్చీ నిర్మాణం జరుగుతోందని చెప్పారు. కాలనీలో మురుగు నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మిస్తున్నామని తెలిపారు. కాలనీలో మౌలిక వసతుల కల్పన వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అన్ని గృహాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇంత సుదరంగా మోడల్ కాలనీగా రూపొందించడం ఆనందంగా ఉందని హౌసింగ్ అధికారులను అభినందించారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, పీఆర్ డీఈ శేషయ్య, విద్యుత్ డీఈ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఏపీఎం శ్రీనివాసులు, ఏపీవో దాసు పాల్గొన్నారు.

మద్యం, మాదక ద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం

- నేరాల అదుపునకు సాంకేతిక పరిజ్ఞానం
- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

కారంచేడు: ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి అక్రమంగా వస్తున్న మద్యంతోపాటు, ఇతర మత్తు పదార్థాల తరలింపులపై నిరంతర నిఘా ఉంచుతున్నామని.. నేరాల అదుపుపై ఉక్కుపాదం మోపనున్నట్లు బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. చీరాల సబ్‌డివిజన్ పరిధిలోని కారంచేడు పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన వార్షిక తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. మొదటిసారిగా స్టేషన్‌కు వచ్చిన ఎస్పీకి స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ జీ శ్రీనివాస రావు ఆధ్వర్యంలో సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆయన స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలు, లారీలను (ప్రాపర్టీ వాహనాలు) ఆయన పరిశీలించారు. అనంతరం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ప్రాపర్టీ నేరాలు జరగకుండా బీట్‌ను పటిష్టపరుస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాల కట్టడిపైనా నిరంతర నిఘాను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పలు కేసులను ఛేదించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసుస్టేషన్ పరిధిలోని మహిళా పోలీసులు, గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. స్టేషన్ పరిధిలో ఎక్కువగా జరిగే నేరాలు ఎలా ఉన్నాయి, రౌడీలు, సస్పెక్ట్‌లు, పాతనేరస్తులు, వారి ప్రస్తుత జీవన విధానం, కుటుంబ తగాదాలు, వర్గ విభేదాలు వంటి విషయాలపై ఆయన ప్రతి ఒక్కరి నుంచి సమాధానం అడిగి తెలుసుకున్నారు. సచివాలయ మహిళా పోలీస్‌లు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని, మరింత అంకితభావంతో పని చేస్తూ మీ గ్రామాల్లో ఎదురయ్యే పూర్తి సమాచారాన్ని మీ ఎస్‌హెచ్‌ఓలకు అందించాలన్నారు. స్టేషన్ పరిధిలో పోలీసు సిబ్బంది వారి దత్తత గ్రామాలను వారానికి ఒకసారైనా తప్పకుండా సందర్శించాలన్నారు. స్టేషన్‌లోని క్రైమ్ రికార్డులను, సీడీ ఫైల్స్‌ను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమైన ప్రదేశాలు, రహదారులపైన సీసీ కెమెరాలు ఏర్పాటు చెయ్యాలన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించి ఆ ప్రదేశాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన సిబ్బందికి వివరించారు. మహిళలు, మైనర్ బాలికలపై ఎవరైనా నేరాలకు పాల్పడితే వారిపై కఠినమైన చర్యలుంటాయన్నారు.

పర్యావరణానికి అందరం కృషి చేద్దాం..

మనందరం మన ప్రాంతంలో కనీస పర్యావరణ పరిరక్షణకు బాధ్యులుగా ఉందామని ఎస్పీ వకుల్‌జిందాల్ అన్నారు. ఆయన కారంచేడు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఒక మొక్కను నాటారు. ప్రతి ఒక్కరం ఒక్కో మొక్క నాటడం వలన పర్యావరణం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో చీరాల డీఎస్పీ ప్రసాద రావు, బాపట్ల స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఏ శ్రీనివాస్, ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీ సూర్యనారాయణ, కారంచేడు, ఇంకొల్లు, చినగంజాం ఎస్సైలు జీ శ్రీనివాసరావు, నాయబ్ రసూల్, సురేష్, హరికృష్ణ, ఏ శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా పీవీఆర్ జన్మదిన వేడుకలు

పలు చోట్ల అన్నదానం, అల్పాహారం పంపిణీ



పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పీఆర్కే, పీవీఆర్, తండ్రి వెంకటేశ్వరరెడ్డి

మాచర్ల: వైఎస్సార్ సీపీ మూడు జిల్లాల జోనల్ ఇన్‌ఛార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాలలో పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, తండ్రి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత పట్టణంలోని వివిధ దేవాలయాలలో పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో పీవీఆర్‌చే కేక్ కట్ చేయించి టపాసులు పేల్చి సంబరాలు చేశారు. పలు దేవాలయాలలో పూజల అనంతరం పీవీఆర్ వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి చేరుకోగా ఆయన తండ్రి పిన్నెల్లి వెంకటేశ్వరరెడ్డి, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిల ఆశీస్సులు పొంది కార్యాలయంలో కేక్ కట్ చేశారు. పట్టణంలోని 31వ వార్డులో కందుకూరి రత్నరాజు, శ్రీనివాస్ వేల్పుల దానియేలుతోపాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేసి అల్పాహారం పంపిణీ చేశారు. కౌన్సిలర్ పోలా శ్రీను ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిలో పులిహోర పంపిణీ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురు కొత్తిమీర కొండలు ఆధ్వర్యంలో 500 మందికి అన్నదానం చేశారు. పట్టణంలోని నెహ్రూనగర్‌లో స్టార్ మల్లయ్య కుమారులు శివానాయుడు, మధు, హైట్ వీరారెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు గంటా వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 1వ వార్డులో గట్ల అరుణ కోటిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, కమిషనర్ ఈవి రమణబాబు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సెయింట్ ఆన్స్ చిన కాన్వెంట్ వద్ద మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్ ఆధ్వర్యంలో అల్పాహారాన్ని పంపిణీ చేశారు. రోప్‌వేకాలనీలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సంఘం నాయకుడు కోనంకి రవి యాదవ్ ఆధ్వర్యంలో 1000 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కిడ్స్ పాఠశాల ఎదురు అపార్ట్‌మెంట్ వైఎస్సార్‌సీపీ ఆర్యవైశ్య సంఘ నాయకులు కంభంపాటి అనిల్, అమర్, తిరివీధి వెంకట నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమాలలో మున్సిపల్ మాజీ చైర్మన్ బత్తుల ఏడుకొండలు, ప్రభుత్వ ఆసుపత్రుల నియోజకవర్గ గౌరవాధ్యక్షులు కొండవీటి రామకోటయ్య, మాచర్ల ఎంపీపీ బూడిద శ్రీనివాసయాదవ్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు శేరెడ్డి గోపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి మేకల కోటిరెడ్డి, కౌన్సిలర్లు షేక్ మస్తాన్, సుభాని, కరిముల్లా, మదార్, కలివెల జ్యోతి, రామిశెట్టి వెంకటేశ్వర్లు, రామాంజనేయరెడ్డి, గట్ల కోటిరెడ్డి, బత్తిన వేణు, చందూగౌడ్, వైస్ చైర్మన్‌లు పోలూరి నరసింహారావు, కొత్తమాసు పాండురంగారావు, ఆర్యవైశ్య సంఘ నాయకులు, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, సబ్ రిజిస్ట్రార్ వివిధ శాఖాధికారులు పీవీఆర్‌ను సత్కరించారు.

ప్రజలను మోసగించేందుకు కుట్రలు

నిజాంపట్నం: నిన్నమొన్నటి వరకు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకున్న టీడీపీ, బీజేపీలు ఒక్కటే అనే సంకేతాలు ఇస్తూ రానున్న ఎన్నికల్లో ప్రజలను మోసగించేందుకు సిద్ధమౌతున్నాయని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు విమర్శించారు. మండలంలోని కల్లిఫలం పంచాయతీ పరిధిలోని కోనఫలంలో గ్రామంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు, పురందేశ్వరి, నడ్డా, సీఎం రమేష్, సుజనా చౌదరిలు కలయికలు ప్రజలు పెద్దగా ఆశ్చర్యపోవటం లేదన్నారు. చంద్రబాబు తన స్వార్థం కోసం ఎంతకైనా తెగిస్తాడన్నారు. పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌కే వెన్నుపోటు పొడిచి ఆయన మరణానికి కారణమైన చంద్రబాబు అధికారం కోసం ఎన్ని అడ్డదారులైన తొక్కడానికి సిద్ధపడతాడన్నారు. కేంద్రంలో టీడీపీ భాగస్వామిగా ఉన్న సమయంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావుకు చిహ్నంగా ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించని చంద్రబాబు నేడు ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎన్టీఆర్‌కు జాతీయస్థాయిలో గౌరవం అందించే కార్యక్రమాల్లో అంతా తానే అన్నట్లు ప్రజలను మోసగించే కుట్రలకు పాల్పడుతున్నడన్నారు. అధికారం కోసం పిల్లని చ్చిన మామను, అధికారం దక్కగానే ఓట్లు వేసిన ప్రజలను మోసగించటం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. అవకాశవాద రాజకీయాలకు చంద్రబాబుకు మించిన నాయకుడు లేడన్నారు. ఎన్ని పొత్తులు ఎన్ని కుట్రలు చేసినా చంద్రబాబుకు ప్రజలు మరోమారు బుద్ధి చెప్పటం ఖాయమన్నారు.

యార్డులో 32,367 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 31,211 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 32,367 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ. 9,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,000 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ. 14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 9,668 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సెప్టెంబరు 30న ఆహ్వాన నాటకోత్సవాలు

పాత గుంటూరు: సినీ నటుడు అల్లు రామలింగయ్య శత జయంతిని పురస్కరించుకుని నాటకరంగాన్ని ప్రోత్సహించేలా సెప్టెంబరు 30, అక్టోబరు 1న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞానమందిరంలో ఆహ్వాన నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు నాటక కళాపరిషత్ అధ్యక్షుడు పి. శివప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న కళాకారులు 80741 48228 నెంబరును సంప్రదించాలని పేర్కొన్నారు.